క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తరశతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాత పైడినాయుడుకు బాండ్ అందిస్తున్న ఏఈవో శ్రీనివాసరావు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గురువారం సింహాచలానికి చెందిన కోరాడ పైడినాయుడు అనే దాత రూ.లక్ష విరాళాన్ని నగదు రూపంలో అందించారు. దేవస్థానం తరపున దాతకు అన్నప్రసాద విభాగం ఏఈవో పిల్లా శ్రీనివాసరావు బాండ్ అందించి, స్వామి వారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాన్ని బహూకరించారు. కార్యక్రమంలో అన్నప్రసాద పథకం ఉద్యోగి దొంతల రమణ పాల్గొన్నారు.

శివాలయ నిర్మాణానికి విరాళం

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి స్థానిక ఎంపీటీసీ బయలపూడి దేముడుబాబు కుటుంబ సభ్యులు రూ.72,116 విరాళాన్ని గురువారం అదించారు. ఈ మొత్తాన్ని నిర్మాణంలో ఉన్న స్వామివారి ఆలయం వద్ద ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు ఇచ్చారు. దేముడుబాబు కుటుంబ సభ్యులకు కమిటీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దంగేటి నాగేశ్వరరావు, బర్ల రమణ, గెద్దం కృష్ణ, రమణ, బయలపూడి అచ్చయ్య, కనకరాజు, జెట్టి ప్రసాద్ ఉన్నారు.

కూటమి ప్రభుత్వం హామీ నిలబెట్టుకోవాలి

పెందుర్తి: పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామన్న కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన 2, 3 సెంట్ల ఇళ్ల స్థలాల కోసం సీపీఐ ఆధ్వర్యంలో పెందుర్తి కూడలి వద్ద ప్రజలు దరఖాస్తులు నింపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో కేటాయించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వై.రాంబాబు, అసిరినాయుడు, రమణ, రజని, రామలక్ష్మి, నారాయణ, దివ్య, పావని తదితరులు పాల్గొన్నారు.

గొరపల్లిలో గడ్డివాముల దగ్ధం



గడ్డివాములకు అంటుకున్న మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు

పెందుర్తి: మండలంలోని గొరపల్లిలో గురువారం రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామంలో నివాసం ఉంటున్న కోట్ని శ్యామల ఇటీవల వరిచేను నూర్పిడి చేసి, గడ్డిని కుప్పలు వేయించింది. గురువారం ఆ కుప్పల నుంచి మంటలు చెలరేగడంతో స్థానికులు సబ్బవరం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. శకటం వచ్చి మంటలను అదుపులోకి తెచ్చింది. అయితే అప్పటికే గడ్డివాములు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి.

కోడి పందాల శిబిరంపై పోలీసుల దాడి

పరవాడ: రావాడ శివారు బొట్టవానిపాలెంలో మరిడిమాంబ పండగ సందర్భంగా గురువారం నిర్వహించిన కోడి పందాల శిబిరంపై సీఐ ఆర్.మల్లికార్జునరావు తన సిబ్బందితో దాడి చేశారు. కోడి పందాలు ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రెండు కోడి పుంజులు, రూ.2,050 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు.

నియోజకవర్గంలో పేదోడి కష్టాన్ని భూ బ్రోకర్లు దోచుకుతింటున్నారు. కాయకష్టం చేసుకుని సంపాదించిన సొమ్మును భూ మాయగాళ్లు కాజేస్తున్నారు. తలదాచుకోవడానికి తమకంటూ సొంతంగా కాస్త నీడ కోసం ఏళ్లతరబడి చెమటోడ్చి పోగేసిన డబ్బును 'కూటమి'లోని కొందరు కేటుగాళ్లకు ధార పోసి మోసపోతున్నారు. ఎప్పుడైనా అధికారులు తప్పనిసరి పరిస్థితుల్లో కూలగొట్టాల్సి వస్తే బ్రోకర్లను నమ్మిన నిరుపేదలకు కట్టుబట్టలే మిగులుతున్నాయి.



కార్మికనగర్‌లో అక్రమంగా పాకలు వేసిన టీడీపీ నాయకుడు



చినముషిడివాడ చెరువులో టీడీపీ నాయకులు నిర్మించిన షెడ్‌లు

ప్రభుత్వ స్థలాలు, చెరువుల్లో కూటమి నాయకుల కబ్జాకాండ

తక్కువ సొమ్ముకు ప్రభుత్వ భూములు విక్రయిస్తున్న ముఠాలు

పేదలే లక్ష్యంగా రూ.లక్షల్లో దోచుకుంటున్న వైనం



పాక వెయ్.. అమ్మే సెయ్..!

కూటమిలో.. భూ బకాసురులు

పెందుర్తి: మండల రెవెన్యూ పరిధిలోని పట్టణ ప్రాంతంలో ప్రభుత్వ భూములు, గెడ్డలు, చెరువులు అన్యాక్రాంతమవుతున్నాయి. వీటిని తమ గుప్పెట్లో పెట్టుకుంటున్న టీడీపీ, జనసేన నాయకులు ప్లాట్లుగా వేసి అడ్డగోలుగా విక్రయాలు సాగిస్తున్నారు. రిజిస్టర్డ్, డీ పట్టా భూముల కంటే చవగ్గా రావడం, అధికారుల నుంచి ఇబ్బందుల్లేకుండా చూస్తామన్న కూటమి నేతల భరోసాకు తలొగ్గిన మధ్య, దిగువ మధ్య తరగతి ప్రజలు నిలువునా మోసపోతున్నారు. ఆక్రమణలపై ఫిర్యాదులు వచ్చాక, అధికారులు రంగంలోకి దిగడంతో తొలుత వీరి నిర్మాణాలే నేలకూలుతున్నాయి.

అడ్డగోలు ఆర్జనే లక్ష్యంగా..

పెందుర్తి ప్రాంతంలో ప్రభుత్వ భూములకు కొదవ లేదు. ఈ భూముల్లో కిందిస్థాయి అధికారుల అండతో కొందరు బ్రోకర్లు పాగా వేశారు. పెందుర్తి, చినముషిడివాడ, సుజాతనగర్, చీమలాపల్లి, కృష్ణరాయపురం ప్రాంతాల్లో కూటమి పార్టీలకు చెందిన చోటామోటా నాయకులే బ్రోకర్ల అవతారం ఎత్తుతున్నారు. ఖాళీ స్థలాలతో పాటు చెరువులు, కొండలు, ఇతర ప్రభుత్వ స్థలాలను చిన్నచిన్నగా చదును చేస్తున్నారు. తమ అనుచరుల ద్వారా దిగువ మధ్యతరగతి వాళ్లను బుట్టలోకి దించుతున్నారు. కూలి పనులు, చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకుంటున్నవారే లక్ష్యంగా, దొంగపత్రాలు సృష్టించి ధర నిర్ణయిస్తున్నారు. 60–120 చదరపు గజాల విస్తీర్ణంలో ప్లాట్లు వేసి, రూ.6 లక్షల నుంచి రూ.12 లక్షల మధ్య విక్రయించి, సొమ్ము చేసుకుంటున్నారు.

కూటమి నేతల అండతోనే..

ఈ మొత్తం వ్యవహారంలో కూటమి నేతల అండదండలు పుష్కలంగా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధుల పూర్తిస్థాయి అండ ఉంటే ఆక్రమిత స్థలాలను కొనుగోలు చేసిన వారికి కొంత వరకు గ్యారెంటీ ఉంటుందని నమ్మకం. కబ్జా స్థలాలను విక్రయించేవారు కూడా తరచూ కూటమి ముఖ్య నేతల వెన్నంటే ఉండటం, వారితో దిగిన ఫొటోలను చూపి నమ్మకాన్ని కలిగిస్తున్నారు. కొన్నిసార్లు వీటిలో షెడ్లు నిర్మించి, దానికి విద్యుత్, జీవీఎంసీ నుంచి ఆస్తిపన్ను వేయిస్తున్నారు. వర్గ విభేదాల కారణంగా ఆయా స్థలాలపై ఫిర్యాదులు వస్తే మాత్రం అధికారులు కూలదోస్తున్నారు. ఇలాంటి సంఘటనల్లో ఇటు స్థలమూ దక్కక.. అటు బ్రోకర్లకు ఇచ్చిన డబ్బులూ తిరిగి రాక బాధితులు ఆర్థికంగా మరింత నష్టపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ భూ దందాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.



చినముషిడివాడ చెరువులో టీడీపీ నాయకులు కొత్తగా చేపట్టిన నిర్మాణం

ప్రభుత్వ స్థలాలు కొనుగోలు చేయొద్దు



ప్రభుత్వ స్థలాల సంరక్షణ మా బాధ్యత. ప్రభుత్వ స్థలంలో ఎవరు నిర్మాణం చేపట్టినా కూల్చేస్తాం. ఇక అమ్మకాల సంగతి మా దృష్టికి రాలేదు. ఎవరైనా బాధితులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే దానిపై విచారణ జరిపి, చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ స్థలాలు కొనుగోలుచేస్తే నష్టపోవడం తప్ప ఇంకేం ప్రయోజనం ఉండదు.

– ఎం.ఆనంద్‌కుమార్, తహసీల్దార్, పెందుర్తి

వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా దేవిసాంబ

- జిల్లా అధికార ప్రతినిధిగా జోబ్‌దాస్(చిన్ని)
- జిల్లా కమిటీలో పెందుర్తికి ప్రాధాన్యత



వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోడిగుడ్ల దేవిసాంబమూర్తి



వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మనాలత జోబ్‌దాస్(చిన్ని)

పెందుర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా కమిటీలో పెందుర్తి నియోజకవర్గానికి ప్రాధాన్యత దక్కింది. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా పెందుర్తి మండలం సరిపల్లికి చెందిన కోడిగుడ్ల దేవిసాంబమూర్తి నియమితులయ్యారు. దేవిసాంబ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రెండు పర్యాయాలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, సరిపల్లి సర్పంచ్, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడిగా సేవలందించారు. పార్టీ కార్యక్రమాల్లో ఆయన చురుగ్గా వ్యవహరిస్తుంటారు.

● పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా జీవీఎంసీ 95వ వార్డు లక్ష్మీపురానికి చెందిన మనాలత జోబ్‌దాస్(చిన్ని) నియమితులయ్యారు. చిన్ని తొలి నుంచీ పార్టీలో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. గతంలో పార్టీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా, జేసీఎస్ జోన్–8 కన్వీనర్, పార్టీ మండల అధ్యక్షుడిగా సేవలందించారు. ప్రస్తుతం ఎస్సీ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర వెల్డింగ్ ఇన్‌స్టిట్యూట్ యజమానుల సంఘం ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. తమకు జిల్లాస్థాయిలో ఉన్నత పదవులు రావడానికి చొరవ చూపిన పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కు దేవిసాంబ, చిన్ని కృతజ్ఞతలు తెలిపారు. 2029 ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేలా తమ వంతుగా పార్టీని బలపేతం చేస్తామని పేర్కొన్నారు.

శతశాతం ఇంటి పన్ను వసూలు చేయాలి

- జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషరాణి



సబ్బవరం సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో శిరీషరాణి

సబ్బవరం: గ్రామాల్లో శతశాతం ఇంటి పన్నులను వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) ఆర్.శిరీషరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలోని అసకపల్లి, పైడివాడ అగ్రహారం, సబ్బవరంలోని సంపద తయారీ కేంద్రాలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో త్వరితగతిన శతశాతం ఇంటి పన్నులు వసూలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో చెత్తను ఎక్కడి పడితే అక్కడ పారబోస్తే సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. రోజువారీ చెత్తను సేకరించే పారిశుధ్య కార్మికులకు తగు సూచనలు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండల కేంద్రం సబ్బవరంలోని సంపద తయారీ కేంద్రానికి చెత్తను తరలించవద్దన్నారు. ఇక్కడ సేకరించిన చెత్తను విశాఖలోని డంపింగ్ యార్డ్‌కు నేరుగా తరలించే ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ విష్ణుకుమార్, స్థానిక పంచాయతీ ఈవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలు అరికట్టాలని వినతి



సీఐ మల్లికార్జునరావుకు వినతిపత్రం అందిస్తున్న టిడ్కో కాలనీవాసులు

పరవాడ: స్థానిక టిడ్కో కాలనీలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావును కోరారు. ఈ మేరకు ఐద్వా ఆధ్వర్యంలో గురువారం సీఐకి మహిళలు వినతిపత్రం అందించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు ఇక్కడ కాలనీలో ఇళ్లను అద్దెకు తీసుకొని, అసాంఘిక కార్యకలాపాలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రశ్నించిన స్థానికులపై ఎదురు తిరిగి, గొడవలకు దిగుతున్నారని వాపోయారు. కాలనీలో బ్యాచ్‌లర్స్ ఇళ్లను అద్దెకు తీసుకొని తరచూ మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు. గంజాయి, గుట్కా బ్యాచ్‌లు హల్‌చల్ చేయడంతో మహిళలకు చాలా ఇబ్బందిగా ఉందన్నారు. వీధి లైట్లు లేక తరచూ కాలనీలో చోరీలు జరుగుతున్నాయన్నారు. కాలనీలో అపరిచితుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోందని, వీటి నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల ఉత్సవాలు



దుర్గమాంబను దర్శించుకుంటున్న మాడుగుల ఎమ్మెల్యే బండారు

పరవాడ: కలపాక గ్రామంలో కొలువుదీరిన దుర్గమాంబ అమ్మవారి ఉత్సవాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో జరిపారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. గ్రామ సర్పంచ్ బొండా కనకారావు, ఎంపీటీసీ చప్పా సన్యాసిరావు, కూటమి నాయకులు అట్టా సన్యాసప్పారావు, ఇందల కొండలరావు, పైల చినఅక్కునాయుడు, గొర్లి శ్రీనివాసరావు, రతాలు సన్యాసిరావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని డప్పులు, చిడతలు, తప్పెటగుళ్లు, సాముగరిడీలు, నేల డ్యాన్స్‌ల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. భారీ బాణసంచా వెలుగుల మధ్య అనుపు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



బండిమాంబను దర్శించుకుంటున్న గండి రవికుమార్ తదితరులు

సబ్బవరం: మండలంలోని మొగలిపురం గ్రామ ప్రజల ఆరాధ్య దేవత బండిమాంబ అమ్మవారి తీర్థమహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. వేకువజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో వచ్చి, అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయుడు గండి రవికుమార్ పార్టీ నాయకులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని, పూజలు నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారిని దర్శించుకున్న వారిలో పార్టీ నాయకులు యడ్ల నాయుడు, గండి ముత్యాలనాయుడు, ఐడీ బాబు, అప్పికొండ సత్యనారాయణ, గురి సత్యారావు, కరక రాము, గురి శ్రీనివాస్, పైల దేముడు, పైల రామునాయుడు, గురి చినదేముడు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి సీతారామాలయ వార్షికోత్సవాలు

సింహాచలం: 98వ వార్డు పరిధి సింహపురికాలనీలో ఉన్న సీతారామాలయ 22వ వార్షికోత్సవాలను శుక్రవారం నుంచి ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 14న సాయంత్రం 6.30 గంటలకు వార్షికోత్సవాల ప్రారంభోత్సవంలో భాగంగా జ్యోతి ప్రజ్వలన, అనంతరం రుత్విక్ వరణం, యాగశాల ప్రవేశ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 15న ఉదయం ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజారోహణ, రాత్రి 7 గంటల నుంచి సీతారాముల వార్షిక కల్యాణ మహోత్సవాన్ని వైభంగా జరపనున్నట్లు వెల్లడించారు. 19వ తేదీన నిర్వహించే కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తులంతా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాల్సిందిగా కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ: వాడచీపురుపల్లి, పరవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితంగా పరవాడ, రావాడ, వెన్నలపాలెం, భర్నికం, గొర్లివానిపాలెం, బోనంగి, దేశపాత్రునిపాలెం, కలపాక, పి.బోనంగి, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, దోసూరు, తిక్కవానిపాలెం పంచాయతీల పరిధి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు.

త్వరితగతిన రోడ్డు పూర్తి



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముమ్మన

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు లక్ష్మీపురం సమీపంలోని అమృతనగర్‌లో జీవీఎంసీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డును కార్పొరేటర్ ముమ్మన దేముడు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.15 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. త్వరితగతిన రోడ్డు పూర్తి చేయాలని అధికారులను సూచించారు. ఆయన వెంట కాలనీ పెద్దలు ఉన్నారు.

రాంబాబుకు పరామర్శ



రాంబాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న గండి రవికుమార్ తదితరులు

సబ్బవరం: గొటివాడ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దువ్వూరి రాంబాబు మేనత్త కనకమ్మ ఇటీవల మరణించారు. వారి కుటుంబ సభ్యులను పార్టీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ గురువారం పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల విభాగం అధ్యక్షుడు కర్రిబాబు, గొటివాడ ఉప సర్పంచ్ దుర్గాప్రసాద్, పార్టీ నాయకులు విరోతి రామారావు, లగిశెట్టి కుమార్, యడ్ల నాయుడు, సిరపరపు వాసు ఉన్నారు.

రాచ్చెరువులో రోడ్డు నిర్మాణంలో వివాదం



రోడ్డు పనులను అడ్డుకుంటున్న స్థానికులు

పెందుర్తి: జీవీఎంసీ 96వ వార్డులో జీవీఎంసీ నిధులతో చేపడుతున్న కాలనీల అంతర్గత రోడ్ల నిర్మాణాల్లో వివాదాలు కొనసాగుతున్నాయి. స్థానిక టీడీపీ నాయకులు ఇష్టానుసారంగా వ్యవహరించడంతో రోడ్ల నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయి. తాజాగా గురువారం పెందుర్తి రాచ్చెరువు ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణంలో వివాదం తలెత్తింది. ఇక్కడ రోడ్డు రెండు వైపులా ఒకేలా నిర్మాణం చేయడం లేదని స్థానికులు ఆందోళనకు దిగారు. ఓ వైపు టీడీపీ నాయకులకు అనుకూలంగా, మరోవైపు స్థానికులకు ఇబ్బందికరంగా రోడ్డును నిర్మిస్తున్నారంటూ పనుల్ని అడ్డుకున్నారు. దీంతో జీవీఎంసీ అధికారులు, స్థానిక కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు వచ్చి స్థానికులతో చర్చించారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా రోడ్డు నిర్మాణం చేపడతామని సర్ది చెప్పడంతో తాత్కాలికంగా ఆందోళన సద్దుమణిగింది.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలకు కృషి



పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవికుమార్

పరవాడ: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి, వారి మన్ననలు పొందడానికి కృషి చేయాలని అనకాపల్లి జిల్లా వైద్యాధికారి రవికుమార్ సూచించారు. స్థానిక పీహెచ్‌సీని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆస్పత్రి వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు జరపడానికి అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పించిందన్నారు. సాధారణ ప్రసవాలు ఆస్పత్రిలోనే నిర్వహించాలని సూచించారు. సాధారణ ప్రసవాలపై గర్భిణులకు అవగాహన కల్పించేలా వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఆకస్మిక తనిఖీలో భాగంగా ఆస్పత్రి రికార్డులను పరిశీలించి, ఓపీ, ఫార్మసీ, రక్త పరీక్షలు జరిపే గదుల్ని తనిఖీ చేశారు. ఆయన వెంట పరవాడ వైద్యాధికారులు హారిక, జయశ్రీ కరిష్మా, కమ్యూనిటీ హెల్త్ అధికారి సాయిరామ్, యూడీసీ ఆనంద్‌కుమార్, స్టాఫ్ నర్స్ రాజేశ్వరి, ల్యాబ్ టెక్నీషియన్ ఎం.అన్నపూర్ణేశ్వరి ఉన్నారు.

298 మందికి ఉపాధి అవకాశాలు



పెందుర్తి: ప్లేస్‌మెంట్‌కు ఎంపికైన విద్యార్థులు

- పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో 186 మంది, సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 112 మంది ఎంపిక

పెందుర్తి: చెన్నైలోని రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థలో ఉపాధి కోసం కోస్తా జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. 261 మంది విద్యార్థులు ఈ టెస్ట్‌లో పాల్గొనగా పెందుర్తి నుంచి 113 మంది, నర్సీపట్నం నుంచి 46, ఆముదాలవలస నుంచి 17, కాకినాడ నుంచి 10 మంది కలిపి మొత్తం 186 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. వీరికి ఏడాదికి రూ.2.2 లక్షల ప్యాకేజీ అందుతుందన్నారు. ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ యు.జయలక్ష్మి, హెచ్‌వోడీలు డాక్టర్ ఎం.నాగమణి, డాక్టర్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సబ్బవరం: ఎంపికైన విద్యార్థులతో సిబ్బంది

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్(జేకేసీ) ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో 112 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి తెలిపారు. నక్కపల్లిలోని హెటిరో ఫార్మా, అచ్యుతాపురంలోని యొకోహోమా టైర్స్ కంపెనీలో ఖాళీల భర్తీకి ఆయా కంపెనీల ప్రతినిధులు ఈ డ్రైవ్ నిర్వహించారు. సబ్బవరం కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులతో పాటు, వివిధ ప్రాంతాలకు చెందిన 415 మంది అభ్యర్థులు జాబ్ మేళాకు హాజరైనట్లు పేర్కొన్నారు. హెటిరో ఫార్మా కంపెనీకి 95 మంది, యొకోహోమాకు 17 మంది ఎంపికయ్యారని తెలిపారు. వీరిలో 25 మంది తమ కళాశాలకు చెందిన పూర్వవిద్యార్థులేనని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులను అభినందించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు ఐ.నరేష్, ఎస్.సాయికుమార్, శ్రావణ్ కుమార్, జేకేసీ కో ఆర్డినేటర్ బి.శంకర్, కె.దేముళ్లు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



పెందుర్తి: స్థానిక లయోలా వృద్ధాశ్రమంలో ఉంటున్న గుర్తు తెలియని వృద్ధుడు(50) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మరణించాడు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపిన వివరాలు.. ఇటీవల ఓ వ్యక్తి పెందుర్తిలో సంచరిస్తుండటాన్ని గమనించిన పోలీసులు అతడ్ని స్థానిక లయోలా వృద్ధాశ్రమానికి తరలించారు. బుధవారం అతడు అస్వస్థతకు గురవడంతో ఆశ్రమ నిర్వాహకులు కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అతడు మరణించాడు. పోస్టుమార్టం సమయంలో మృతుని పొట్టపై శస్త్రచికిత్స చేసి, కుట్లు వేసినట్లు వైద్యులు గుర్తించారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారని, వివరాలు తెలిసిన వారు 94407 96039, 96767 97314 నెంబర్లలో సంప్రదించాలని సీఐ సూచించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పెందుర్తి

9912222753

Office mail : sakshiadvtvsp@gmail.com